నిరుద్యోగులను విస్మరిస్తున్న పాలకులు

- పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్
రాయలసీమలోని నిరుద్యోగులను పాలక ప్రభుత్వాలు విస్మరించుకుంటూ వస్తున్నాయని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు పేర్కొన్నారు. ఎన్నికల సమయాల్లో వీరిని రాజకీయంగా వాడుకుంటారని అనంతరం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని పోస్టులు భర్తీ చేసిందని ప్రశ్నించారు. కేవలం వాలంటీర్ పోస్టులు భర్తీ చేసి ఉద్యోగాలు భర్తీ చేసామని ప్రకటించడం సరైంది కాదన్నారు. అందుకే పట్టభద్రులు ఇప్పటికైనా మేల్కొని రాబోయే శాసనమండలి ఎన్నికల్లో నిస్వార్థంగా సేవ చేసేటటువంటి పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకోవాలని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు కడప అనంతపురం మూడు జిల్లాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గుర్తు చేశారు. ఇప్పటివరకు అనేక ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదన్నారు. వీటితోపాటు డిఎస్‌సి ద్వారా అనేక ఉపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీలుగా ఉన్నాయన్నారు. ఈ పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రానున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన తనను మండలికి పంపిస్తే నిరుద్యోగుల తరఫున పోరాటం చేస్తానన్నారు. ప్రభుత్వ పోస్టుల ఖాళీల భర్తీకి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు పలకాలని ఆయన నిరుద్యోగులను కోరారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

- గోనెగండ్ల మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన - జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన
- కులుమాల సచివాలయం తనిఖీ - పది విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి - గోనెగండ్ల
పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. శనివారం గోనెగండ్ల మండలంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని అల్వాల, కులుమాల గ్రామాల్లో పర్యటించి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని పెంచాలి
ముందుగా అల్వాల గ్రామానికి వెళ్లిన ఆయన నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అన్ని సౌకర్యాలూ ఉన్నప్పటికీ తక్కువ సంఖ్యలో నిర్మాణాలు జరుగుతుండడంపై ఆయన మాట్లాడుతూ... ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకొని పురోగతి సాధించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.

కులుమాల సచివాలయం తనిఖీ
అలవాల నుంచి కులుమాల గ్రామానికి చేరుకున్న ఆయన గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఎఎన్ఎంలు, ఐసిడిఎస్ సిబ్బంది సబ్ సెంటర్లలో కూర్చోకుండా సచివాలయాలకు వచ్చి సేవలందించాలని సూచించారు. గ్రామంలోని గర్భిణులకు పోషకాహారం, ఐరన్ మాత్రలు అందించడంతోపాటు ప్రసవానికి వారం ముందే ఆస్పత్రిలో చేర్చి సురక్షిత ప్రసవానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

'పది' విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలి
కులుమాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. చదువు చెప్పడమే కాకుండా విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా తగిన సలహాలు, సూచనలు చేయాలని, అవసరమైన మెటీరియల్ విద్యార్థులకు అందజేయాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థినీ ఇంటర్మీడియట్ కళాశాలలో చేర్పించే బాధ్యత తమదేనని చెప్పారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఇఒఆర్‌డి నగేష్, హౌసింగ్ డిఇ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డి, విద్యుత్ ఎఇ సుధాకర్, హౌసింగ్ ఎఇ లక్ష్మన్న, ఎపిఎం హేమలత పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-పత్తికొండ
ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ బలపరిచిన పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగారెడ్డి కోరారు. శనివారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర, సంబంధించిన ప్రజా సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ మాట్లాడారు. చట్టసభలలో ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై నిరంతరాయంగా పోరాడే వారిని గెలిపించుకోవాలని అన్నారు. మార్చి 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు దస్తగిరి, శ్రీరాములు, బురుజుల రాముడు, కాశి రమేష్, సిద్దయ్య గౌడ్, వినోద్ కుమార్, మధు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

సిలికా సాండ్ గని లీజు అనుమతులు ఇవ్వొద్దు

- కాలుష్య నియంత్రణ మండలి ఆఫీసు ముందు ప్రజల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్
సిలికా శాండ్ గనుల లీజు అనుమతులు ఇవ్వవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ, ఓర్వకల్ మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శనివారం కేతవరం కన్నమడకల గ్రామ ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి ఆఫీస్ ముందు సిలికా శాండ్ లీజులకు అనుమతులు ఇవ్వరాదని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం కేతవరం శాఖ కార్యదర్శి జి.శ్రీధర్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతవరం మాజీ సర్పంచ్ జి.రామకృష్ణ, మండల కార్యదర్శి బి.నాగన్న మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామంలో 8 వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు సంచరించిన ప్రాంతాన్ని వారు వేసిన చిత్రాలు లిపి చరిత్రను, పేద రైతుల పొలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. చేను కంచె మేసినట్లు ప్రభుత్వమే ఆదిమానవులు సంచరించిన ప్రాంతంలో విమానాశ్రయం సమీపంలో లీజులు మంజూరు చేయడమేంటని ప్రశ్నించారు. కన్నమడకల కలవందలపాడు చిన్న సన్నకారు రైతులు పంటలు పండిస్తూ జీవనం చెస్తున్నారని వివరించారు. ఈ పరిశ్రమ వల్ల దుమ్ము వెదజల్లి కాలుష్యంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రజలకు మీడియా ప్రతినిధులకు ఎవరికి తెలియకుండా కాలుష్య నియంత్రణ మండలి వారు ఇతర ప్రాంతాల వారిని తీసుకొచ్చి ఆ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగినట్లు సృష్టించి లీజులు మంజూరు చేయడం కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే కాలుష్య నియంత్రణ మండలి వారు ఆ ప్రాంతంలోని ప్రజల రైతుల అభిప్రాయాలను తెలుసుకొని అనుమతులు ఇవ్వడం పై ఆలోచించాలి అన్నారు. చరిత్రను రైతుల పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అధికారి మాట్లాడుతూ పరిశ్రమ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కొత్తగా ఇచ్చే అనుమతులు ఇవ్వమని హామీ ఇచ్చారు. పనులు నిలుపుదల చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చంద్రబాబు నాయుడు, వెంకటేశ్వర్లు, మధుసూదన్, చాంద్ బాషా, మాసుం, బాష, సలాంబాష, కేతవరం, కన్నమడకల గ్రామ రైతులు శ్రీనివాసులు వెంకటస్వామి, గఫర్ మియా, సయ్యద్‌బాష, రోశన్న రైతులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఎన్నికల వేడి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి
పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి త్వరలో ఎన్నిక జరగనుంది. ఎన్నికల పర్వంలో భాగంగా ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. దాఖలైన నామినేషన్లను పరిశీలించిన అధికారులు ఆమోదించిన, తిరస్కరించిన నామినేషన్ల జాబితాను కూడా విడుదల చేశారు. బరిలో నిలిచిన వారి పేర్లు దాదాపుగా ఖరారయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా వాటిలో ఒకరి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. వైసిపి తరఫున నామినేషన్ దాఖలు చేసిన మధుసూదన్‌తో పాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఆ స్థానానికి బరిలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థులు కూడా ఖరారయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 51 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్షంతో పాటు పలువురు అభ్యర్థులు ప్రచారంలో మునిగిపోయారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్, ప్రజాసంఘాలు బలపరచిన అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరచిన కత్తి నరసింహారెడ్డి ప్రచారంలో ముందంజలో ఉన్నారు. అధికారపక్షం జిల్లాకు చేసిందేమీ లేకపోగా మరోవైపు భారాల పేరుతో సామాన్యుల నడ్డి విరిచింది. నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసింది. జిల్లాలోని ఏ పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు చేపట్టలేదు. ప్రతిపక్షం కూడా గతంలో అధికారంలో ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి చేసిన చర్యలు నామమాత్రమే. ప్రస్తుతం శాసనమండలిలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులు నిరుద్యోగులు, ఉద్యోగులు, యువకులు, సామాన్యుల సమస్యలపైనా, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు కూడా పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులను ఎన్నుకోవడం ద్వారా ప్రజా సమస్యలను మరింతగా మండలిలో వినిపించేందుకు అవకాశం దక్కనుంది.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు
బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగింది. ప్రత్యేక హోదా, విభజన హామీల్లో వేటినీ ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి నిధులు కేటాయించకపోగా కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి రూ.5,300 కోట్లను కేటాయించారు. ఆ ప్రాజెక్టు వల్ల తుంగభద్ర దిగువకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోతుంది. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు ఎడారులుగా మారే ప్రమాదం ఉంది. కేంద్ర బడ్జెట్, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

అవీ.. ఇవీ... అన్నీ..
ఎస్ఐ ఉద్యోగాల నియామకానికి ప్రిలిమ్స్ రాత పరీక్షను నిర్వహించారు. చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడంపై టిడిపి నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళులర్పించారు. జిల్లావ్యాప్తంగా శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టరును విడుదల చేస్తున్న ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి తరుపున విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని సి. క్యాంపు సెంటర్ లోని ప్రభుత్వకార్యాలయాల్లో సిఐటియు, కెవిపిఎస్, రజకసంఘం, బిసిసంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ పోతుల నాగరాజు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రభుత్వ ఆఫీసుల్లో ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఉద్యోగుల నుండి పోతుల నాగరాజుకు విశేషమైన స్పందన లభించింది. పోతుల నాగరాజు కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు కర్నూలు నగరఅధ్యక్షులు ఆర్. నరసింహులు , బిసి సంఘం జిల్లా కార్యదర్శి శేషు ఫణి ,వరుణ్, శేఖర్, రజక సంఘం నగరకార్యదర్శి సి.శేషాద్రి, కెవిపిఎస్ 23వవార్డు కార్యదర్శి పి.బాబురావు, పి.నాగరాజు,వి.సుధాకర్, ఎస్. అజ్మతుల్లా పాల్గొన్నారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు, బిసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేషు ఫణి ఉద్యో గులను ఉద్దేశించి మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగ రాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుంటే చట్టసభల్లో మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తారని అన్నారు. నిరంతరం నిరుద్యోగ యువత , ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులు, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయడం , ఔట్సోర్సింగ్ ఉద్యో గులకు టైం స్కేల్ , ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ , పెన్షనర్స్ హక్కుల పరిరక్షణ నాగరాజు కృషి చేస్తున్నారన్నారు. నాగరాజు గెలుపు కోసం మన మందరం ఓటు వేసి, మన బంధువులు, మన స్నేహితులు, మన పిల్లల చేత ఓట్లు వేయించి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

ఆస్తి నష్టం, ఆర్పేందుకు వెళ్లిన రైతు కుమారునికి గాయాలు

ప్రజాశక్తి-తుగ్గలి : మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో శనివారం రైతురాముడుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. దీంతో లక్ష దాకా ఆస్తి నష్టం జరిగింది. గడ్డివామి దగ్ధం అయిందన్న సమాచారాన్ని తెలుసుకున్న రైతు రాముడు కుమారుడు శ్రీకాంత్ ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. గడ్డివామి దగ్ధమయిందన్న సమాచారం తెలుసుకున్న పత్తికొండ అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆర్పడానికి ప్రయత్నం చేశారు. అదేవిధంగా జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తమ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమన్వయంతో విజయఢంకా మోగిద్దాం

వైసిపి ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్
స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వైసిపి ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్లు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నివాసంలో స్థానిక సంస్థల ఎన్నికల పై ఉమ్మడి కర్నూలు జిల్లా వైసిపి ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎప్పుడూ తప్పుడు ప్రచారం చేస్తుంటారని మండిపడ్డారు. అవాస్తవాలను వాస్తవాలుగా చేసేందుకు చంద్రబాబు ఎప్పుడు ముందుంటారని విమర్శించారు. టిడిపి నేతలపై ఎలాంటి దాడులు అక్రమ కేసులు పెట్టలేదని బుగ్గన వివరించారు. 2019 సంవత్సరం నుంచి రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గిందని కేంద్ర ప్రభుత్వమే చెప్పిందన్నారు. రాష్ట్రంలో వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిసిలకు పెద్ద పీట వేసిందని, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. కర్నూలు జిల్లాలో వాల్మీకి చెందిన మధుసూదన్‌కు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి కూడా మంచి వ్యక్తికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల కో ఆర్డినేటర్లు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, జిల్లాల అధ్యక్షులు బివై. రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంపిలు పోచా బ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, జరదొడ్డి సుధాకర్, తోగురు ఆర్థర్, కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఇసాక్ బాష, ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవింద్రారెడ్డి, మధుసూదన్, జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఉమ్మడి కోఆర్డినేటర్ల సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన

ఆస్పత్రుల నిర్మాణాలువేగవంతం చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్
జిల్లాలో నాడు నేడు కింద చేపడుతున్న ఆస్పత్రుల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సిహెచ్‌సి, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల పురోగతిపై వైద్యాధికారులు, ఇంజనీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని, ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రులు, కోడుమూరు, ఆదోని పిహెచ్‌సిలను బలోపేతం చేసేందుకు చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎనిమిది అర్బన్ హెల్త్ క్లినిక్స్, 354 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల పనులను కూడా వేగవంతం చేయాలని సంబంధిత శాఖల ఇంజనీర్లను ఆదేశించారు. మరో 76 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు ఎస్టిమేషన్‌లను రూపొందించాలని సూచించారు. ఆదోని మెడికల్ కళాశాల, క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ పనుల గురించి కలెక్టర్ ఇఇరాజ గోపాల్‌రెడ్డితో ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య, డిసిహెచ్ఎస్ రాంజీ నాయక్, పంచాయితీ రాజ్ శాఖ ఎస్ఇ సుబ్రమణ్యం, ఇఇ మద్దన్న, ఆర్అండ్‌బి ఎస్ఇ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిహెచ్.మద్దయ్య

డిసిఎంఎస్‌ను ఆదుకోండి : చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: డిసిఎంఎస్‌ను ఆదుకోవాలని కర్నూలు డిసిఎంఎస్ చైర్మన్ సిహెచ్ శిరోమణి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య అన్నారు. ఈ మేరకు శనివారం కల్లూరులోని కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటి వద్ద మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, బుగ్గన రాజేంద్రనాథ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో డిస్ట్రిక్ట్ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డిసిఎంఎస్) నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నామని, నిధులను అధికంగా కేటాయించాలని ఆయన కోరారు. ముఖ్యంగా కర్నూలులో ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. ఎపి మార్క్‌ఫెడ్ నుంచి హమాలి చార్జీలను డిసిఎంఎస్ కు ఇప్పించాలని వారు కోరారు. అందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ అందుబాటులోకి హాల్ టికెట్లు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవబోతున్న ఇంటర్మీడియట్ సెకండియర్ సైన్స్ విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని ఆర్ఐఒ ఎస్‌వివిఎస్ గురువయ్య శెట్టి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ ఫస్టియర్ హాల్ నెంబర్ తో కానీ, లేదా టెన్త్ క్లాస్ హాల్ టికెట్ నెంబరు తో కానీ లేదా ఆధార్ నెంబర్ తో ప్రాక్టికల్ హాల్ టికెట్లను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్తును అక్రమంగా వాడితే చర్యలు

ప్రజాశక్తి- సి బెళగల్ : విద్యుత్‌ను అక్రమంగా వాడితే ఎంతటివారికైనా చర్యలు తప్పవని విజిలెన్స్ బృందం శనివారం హెచ్చరించింది. బెళగల్ లోని ఆయా కాలనీలలో తనిఖీలు చేపట్టి విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఇక్కడే ఇంటింటా మీటర్లు పరిశీలించి సకాలంలో బిల్లులు చెల్లించి ప్రభుత్వదాయానికి తోడ్పాటునందించాలని సూచించారు.

క్రీడల్లో పంచలింగాల జడ్‌పిహెచ్‌ఎస్ ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్
కర్నూలు మండలం పంచలింగాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ప్రతిభను చాటుకుంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ యాదవ్ అన్నారు. మేరకు శనివారం ఆయన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాఠశాలలో అభినందించారు. గత నెల విజయనగరం జిల్లా అనుగోలులో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్-17 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి చంటి పాల్గొని ప్రత్యేక ప్రతిభను కనబరచారన్నారు. సెపక్‌తక్రా అండర్-14 విభాగం పోటీల్లో కవితాబాయి, పూజిత మణికాంత్ ఎంపికై ఈనెల అనంతపురం జిల్లాలో ఉరవకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిఫలం కనపరిచారని జిల్లాకు ప్రథమ స్థానం దక్కిందని మణికాంత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్-17 విభాగంలో బాలికలలో దానమ్మ ప్రతిభతో జిల్లాకు మూడవ స్థానం దక్కిందన్నారు. బాలుర విభాగంలో మాలిక్‌బాష పాల్గొన్నారు. క్రీడాకారులందరిని జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ అధ్యాపకులు శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించిన వారిలో ఉన్నారన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జొన్నకు మద్దతు ధరపై అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్
జొన్న పంటకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2790 గా ప్రకటించిందని తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎఒ మల్లేష్ కుమార్ శనివారం కంభదహాల్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడే ఉగాది తర్వాత కోతలు వస్తున్నందున ముందుగా రైతుల అభిప్రాయాలు తెలిపాలని పేర్కొన్నారు. మిగిలిన పంటల ధాన్యాలకు ఎలాంటి ధరలు మద్దతుగా ఉండాలో ప్రభుత్వం సర్వేలు చేస్తుందని పేర్కొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడే అభ్యర్థులను ఎన్నుకుందాం

- ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

ప్రజా, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలపై పోరాడే అభ్యర్థులను ఎన్నుకుందామని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆలూరు అంబేద్కర్ భవన్‌లో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు అధ్యక్షతన ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దల సభకు ఎమ్మెల్సీలుగా రాజకీయ నేపథ్యం నుంచి వచ్చిన, రాజకీయ పార్టీలపై ఆధారపడి వారు చెప్పినట్లు తల ఊపే వారిని ఎన్నుకుంటే నష్టపోతామని తెలిపారు. పిడిఎఫ్ కూటమి నుంచి ప్రజాసంఘాల మద్దతుతో ప్రజాసేవకు అంకితమైన వారిని ఎన్నుకోవాలని కోరారు. ప్రజల అభివృద్ధికి పాటుపడుతూ ప్రస్తుత రాజకీయాల్లో నిస్వార్థమైన సేవ చేస్తున్న వారి తరఫున ఉపాధ్యాయ, పట్టభద్రుల పశ్చిమ రాయలసీమ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు పెంచి, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు మద్దతు ఇస్తూ, నిరుద్యోగులను గాలికి వదిలేశాయని విమర్శించారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అవసరమన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నాయకులు కెపి.నారాయణస్వామి, కృష్ణ, మల్లేష్, రంగస్వామి, మైనా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

మాట్లాడుతున్న సునీల్ రాజ్ కుమార్

డిడిఒ అధికారాలపై యుటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి - ఆదోని

ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలు ఇస్తూ జిఒ 84ను విడుదల చేయడంపై యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్, మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిడిఒ అధికారాల కోసం విశేష కృషి చేసిన యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యుటిఎఫ్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సునీల్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, సహాధ్యక్షులుగా గిరిబాబు, శశికళ, ఆర్థిక కార్యదర్శిగా జగన్మోహన్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఫయాజుద్దీన్, రాహుల్ అమీన్, అమానుల్లా, కార్యవర్గ సభ్యులుగా నాగేష్, రంగన్న, నరసయ్య, మహేష్, జహంగీర్, రుషికేశవ్, ఇమ్రాన్, చక్రపాణి, విష్ణు, సాధిక్, సాల్మన్, సుధాకర్, శ్రీనివాసులు, మహిళా విభాగం కన్వీనర్‌గా పరిమళ, భాగ్యరేఖ, సువేదమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిడిఒ అధికారులు సాధించుకున్నామని, మిగిలిన అన్ని సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాడి సాధించుకుంటామని నూతన కమిటీ పేర్కొంది.

గంజిహళ్లి బడేసాహెబ్ ఉరుసు ప్రారంభం

- వైభవంగా గంధం మహోత్సవం - దర్గాను దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న నాయకులు

మండలంలోని గంజిహళ్లి గ్రామంలో శ్రీగంజిహళ్లి బడే సాహెబ్ ఉరుసు ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వంశ పారంపర్య పీఠాధిపతులు సయ్యద్ చిన్నముద్గోల్, మాబు సాహెబ్, ఇమామ్ సాహెబ్, హుస్సేన్ సాహెబ్ గ్రామంలోని తమ ఇంటి నుంచి అన్ని లాంఛనాలతో గంధాన్ని తీసుకొచ్చి దర్గాకు చేర్చడంతో గంధం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

దర్శించుకున్న పలువురు ప్రముఖులు : గంధం మహోత్సవం సందర్భంగా వివిధ పార్టీల పలువురు రాజకీయ ప్రముఖులు దర్గాను దర్శించుకున్నారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, కుడా ఛైర్మన్, వైసిపి నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కుమారుడు, వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, బిజెపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కెఆర్.మురహరి రెడ్డి, వైసిపి మంత్రాలయం నియోజకవర్గ యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి దర్గాను దర్శించుకుని బడే సాహెబ్ స్వామివారికి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.

మాదకద్రవ్యాలపై ఉద్యమం : సెబ్ సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోడపత్రికలను విడుదల చేస్తున్న సిఐ, సిబ్బంది

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని ఎమ్మిగనూరు సెబ్ సిఐ జయరామ్ నాయుడు, డాక్టర్ బాలయ్య కోరారు. శనివారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ, మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్కోట్ ఖదిర్ బాష ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలయ్య, సెబ్ సిఐ జయరామ్ నాయుడు మాట్లాడారు. డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడితే ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద 10 నుంచి 20 ఏళ్ల శిక్ష పడుతుందని తెలిపారు. దురలవాట్లను దూరం చేసుకోవడానికి యోగా, ఎక్సర్‌సైజులు, సోషల్ వర్క్, పొలం పనులు చేస్తూ వైద్యుల సలహా పాటించాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగించే వారిపై 14500 కాల్ చేయాలని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రమాణం చేయించారు. అనంతరం ఎంపిజె రాష్ట్ర కార్యదర్శి లాల్కోట్ ఖదీర్ బాష మాట్లాడారు. రాష్ట్రంలో ఎంపిజె ఆధ్వర్యంలో ఫిబ్రవరి నుంచి మార్చి 2 వరకు మాదకద్రవ్యాలపై ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్వకేట్, బార్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ... బాగా చదువుకొని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి రంగన్న, నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహిళా సెక్రటరీ వసుంధర దేవి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ పరశురాం, అన్సర్ బాయ్, రంజిత్ కుమార్ రెడ్డి, సమీవుల్లా, లోకేష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని దర్శించుకున్న మూడు రాష్ట్రాల జడ్జీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

స్వాగతం పలుకుతున్న అధికారులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన జడ్జీలు శనివారం దర్శించుకున్నారు. శ్రీమఠం నుంచి శ్రీగురు వైభవోత్సవాల ఆహ్వానం అందుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి రవి చీమలపాటి, కర్ణాటక హైకోర్టు జడ్జి అనిల్ భీంసేన్ కట్టి, మహారాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీరామ్‌లు మంత్రాలయం చేరుకున్నారు. వారికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పద్మనాభ తీర్థ అతిథి గృహంలో ప్రొటోకాల్‌ను అనుసరించి ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వేణుగోపాల్ రాజు ముగ్గురు జడ్జీలను కలుసుకుని మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనార్థం వారు శ్రీమఠం చేరుకోగా శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాస రావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం అందజేశారు.

శ్రీమఠం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానం

వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు అవార్డులను ప్రదానం చేశారు. శ్రీమఠం ఆవరణంలో ఉన్న యోగీంద్ర సభామండపంలో ఎపి హైకోర్టు జడ్జి రవి చీమలపాటి, కర్ణాటక హైకోర్టు జడ్జి అనిల్ భీంసేన్ కట్టి, మహారాష్ట్ర ముంబై హైకోర్టు జడ్జి కెఆర్.శ్రీరామ్‌తో పాటు బెంగళూరుకు చెందిన డాక్టర్ కమినీ ఎ.రావు, బెంగళూరుకు చెందిన కన్నడ టివి-9 చీఫ్ ప్రొడ్యూసర్ రంగనాథ భరద్వాజ, కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు చెందిన వైడి.వ్యాసరాజ్, కర్ణాటక రాష్ట్రం హంపి విరుపాక్షస్వామి దేవాలయం అర్చకులు శ్రీనాథ శాస్త్రీలు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డులను పొందారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి గుమ్మనూరు

మంత్రి సోదరులకు రాజకీయ నేతల పరామర్శ

- త్రివేణి అంత్యక్రియలకు భారీగా జనసంద్రం...

ప్రజాశక్తి-ఆలూరు

మంత్రి గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ స్వామి భార్య త్రివేణి ఆకస్మికంగా మృతి చెందడంతో శనివారం మంత్రి సోదరులను, కుటుంబ సభ్యులను పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు పరామర్శించారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీర భద్ర గౌడ్, తాలూకా నాయకులు రఘు ప్రసాద్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, బిజెపి నేత పార్థసారథి, మండలాల జడ్‌పిటిసిలు ఏరూర్ శేఖర్, విరుపాక్షి, దొరబాబు, కిట్టు, లింగన్న, చిప్పగిరి లక్ష్మి నారాయణ, తుగ్గలి నాగేంద్ర పరామర్శించి త్రివేణి మృతదేహానికి నివాళులర్పించారు. త్రివేణి అంత్యక్రియలు భారీ జనసంద్రం మధ్య పూర్తయ్యాయి.

చేతిపంపు బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చేతిపంపు బోర్లకు రాష్ట్ర ప్రభుత్వం సామగ్రి మంజూరు చేసిందని ఎంపిడిఒ గౌరీ దేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని సర్పంచులు మరమ్మతులకు నోచని చేతిపంపు బోర్ల నివేదికలు సమర్పించాలని కోరారు. చేతిపంపు బోర్ల మరమ్మతుల సామగ్రి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుందని తెలిపారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఇద్రూస్ బాష పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు కనిపించడం లేదా : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నా ప్రజాప్రతినిధులకు, అధికారులకు కనిపించడం లేదా అని డివైఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దళితవాడల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి బి.దాసు, మండల నాయకులు జి.బాలు, యు.ఆదాము మాట్లాడారు. పెద్దకడబూరు దళితవాడల్లో గత కొన్ని రోజుల నుంచి కాలువలో వెళ్లాల్సిన డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. అనేక మంది స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని, ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఊరు నడిబొడ్డున ఈ సమస్య ఉన్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదని మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దళితకాలనీ వారికి మాత్రమే డ్రెయినేజీ నీరు వచ్చేలా, మిగతా నీరు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమస్యపై 27న ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.

కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

అందుబాటులో ఉండి సేవలు అందించండి

- ఆరోగ్య ఉప కేంద్రాల్లో జిల్లా అధికారి తనిఖీ

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అధికారి బాల మురళీకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని కుంకనూరు, అలారుదిన్నె, దేవనకొండ ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేసవి ప్రారంభమైందని, వడ దెబ్బలకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులకు ఆరోగ్య కార్యకర్తలు వేసిన టీకాలు పర్యవేక్షించారు. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి విజయ భాస్కర్, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఘనంగా 'బ్లాసం కిడ్స్' వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని బాబు ఫంక్షన్ హాలులో బ్లాసం కిడ్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఎంఇఒ ఆంజనేయులు, ప్రముఖ డాక్టర్లు శిల్పా, చంద్రకాంత్ యాదవ్, నాగరాజకుమారి, మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్, పాఠశాల కరస్పాండెంట్లు మల్లేశ్వరి, కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE : CUM : MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL :: KURNOOL
M.V.O.P.NO. 174/2022.

1. Shaik Hanifa Bee
2. Shaik Mubarak
3. Shaik Harshiya.
4. Shaik Mahammad Affan

Petitioner No.3 and 4 are being minor's Rep. by their mother and natural guardian Petitioner No.2 … Petitioners.

VERSUS

1. J. Purushotham Reddy
2. Cholamandalam MS General Insurance Co. Ltd., Rep by its Manager, Hyderabad. … Respondents.

NOTICE TO RESPONDENT.no.1

J. Purushotham Reddy, S/o J. Chinna Thimma Reddy, Major ownerof the vehicle,R/o.H.No.77-188-A-5,Chintala Mani Nagar, Kallur Industrail Area, Kurnool City and Dist.518001.

Where as the petitioners has filed said case against you for compensation under M.V. Act. If you have any objections for the same may appear either in person or through advocate on **27-02-2022 at 10-30 A.M.** before the said court, failing which the matter will be decided in your absence.

Sri.M.L.Srinivasa reddy,
Advocate for petitioner,
CellNo. 9440290266
Kurnool Dist. A.P.

ప్రశ్నించే గొంతులను గెలిపించండి

- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రశ్నించే గొంతులకు గెలిపించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న తెలిపారు. శనివారం పెద్దకడబూరులో ప్రజాసంఘాల నాయకులు ఈ.తిక్కన్న, బి.దాసు, కె.పరమేష్, జి.బాలు, ఆదాముతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ నాయకులు పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరారు. నాడు శాసనమండలినే రద్దు చేయాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు ఏ మోహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచే శాసనమండలిలో పిడిఎఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నీతి, నిజాయితీ, నిరాడంబరత కలిగిన వారు శాసనమండలికి ఎన్నికై ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, రాయలసీమ ప్రాంతాల్లో కరువును శాశ్వతంగా దూరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి పట్టభద్రులు ఆలోచించి నిజాయతీగా ఓటు వేయాలని కోరారు.

పెద్దకడబూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ప్రశ్నించే గొంతులను శాసనమండలికి పంపించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, రాము, నితీష్ పాల్గొన్నారు.

మద్దతు ధరతో శనగ కొనుగోలు

- ఎఒ శివశంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

కొనుగోలు కేంద్రంలో శనగను అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఎఒ శివశంకర్ తెలిపారు. శనివారం హాలహర్వి రైతు భరోసా కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ అధికారులు, డిఎం రాజు, స్థానిక సొసైటీ సిబ్బంది పాల్గొని వారు వచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. శనగ క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.5,335లుగా ప్రకటించిందని తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు సమాచారం వచ్చిన వాళ్లు సోమవారం వెళ్లి గోనె సంచులను తీసుకోవాలని తెలిపారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాలతో నగరడోనా, రామదుర్గం గ్రామాల రైతులకు చెందిన జొన్నలను కొనుగోలు చేసి ప్రారంభించినట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎఒ ఆనంద్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కర్నూలు పౌర సరఫరాల శాఖ డిఎం షర్మిల ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2970తో నగరడోనా, రామదుర్గం గ్రామాలకు 8 మంది రైతుల వద్ద 230 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జొన్నలు అమ్మే ప్రతి రైతూ ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకున్న వారై ఉండలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజులకే రైతు ఖాతాకు ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని తెలిపారు. ఏ ఒక్క రైతు కూడా అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులు మల్లికార్జున, కిష్టప్ప, అగ్రికల్చర్ అసిస్టెంట్లు జ్యోతిర్మయి, సునీత పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలును ప్రారంభిస్తున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎఒ ఆనంద్

యూనియన్ నాయకులపై కక్ష సాధింపు సరి కాదు

- యుఇఇయు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) నాయకుల పట్ల విద్యుత్ శాఖ అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని యూనియన్ డివిజన్ గౌరవాధ్యక్షులు ఈరన్న, సిఐటియు జిల్లా ట్రెజరర్ నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదోని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ కుమార్‌ను కలిశామని, స్పందన కొరవడిందని తెలిపారు. అవినీతి ఆరోపణలు సాకు చూపి శాఖ పరమైన చర్యలకు దిగడం సమంజసం కాదన్నారు. విద్యుత్ శాఖలో ఇతర యూనియన్లు ఉన్నప్పటికీ కేవలం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులపైనే తక్షణ చర్యలు తీసుకొని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని తెలిపారు. గతంలో తమ యూనియన్ డివిజన్ కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. అదే కోవలోనే మల్లికార్జునను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం మానుకోవాలని అధికారులకు హితవు పలికారు. లైన్‌మేన్‌గా పదోన్నతి పొందిన ప్రవీణ్ కుమార్, హనుమేష్, శ్రీనివాసులకు అసిస్టెంట్ లైన్‌మేన్ పే స్కేల్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పదోన్నతి పొంది 8 నెలలు అయినప్పటికీ పే స్కేల్ పెంచకుండా, టిఎ ఇవ్వకుండా అకౌంట్ సెక్షన్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్, మీటర్ రీడింగ్, పోల్ టూ పోల్, వాచ్ మేన్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. నెలనెలా పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వారి ఖాతాలో జమ అయిన తర్వాతనే కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. వాటిని తుంగలో తొక్కి కాంట్రాక్టర్లకు మొత్తం బిల్లులు చెల్లించి కార్మికుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ కుమార్ పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని తెలిపారు. హెచ్ఆర్ మంజూరులో కూడా తారతమ్యం చూపిస్తూ ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తమ యూనియన్ ఉద్యోగులపై తీసుకున్న చర్యలు, విచారణ నివేదిక కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా పొంతనలేని సమాధానం ఇస్తున్నారన్నారు. గతంలో పనిష్‌మెంట్ పొంది ఉద్యోగంలో చేరిన వారికి నోటీసులు ఇచ్చి 'మీ సమాచారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. దీనికి వివరణ ఇవ్వాల'ని వారిని ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతి విద్యుత్ అధికారులకు తగదన్నారు. యూనియన్లు, ఉద్యోగుల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించి, పబ్బం గడుపుకునే ప్రయత్నం మంచిది కాదన్నారు. పోల్ టూ పోల్ కార్మికులు, సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరడం యూనియన్ చేసిన తప్పా అంటూ నిలదీశారు. అధికారులు పక్షపాత ధోరణి వీడాలని, లేకపోతే కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డివిజనల్ కార్యదర్శి మల్లికార్జున, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'అప్పర్ భద్ర' నిర్మాణం ఆపాలి

- రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగంగా చెప్పాలి
- రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

'అప్పర్ భద్ర' నిర్మాణ పనులను ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రజలకు బహిరంగంగా చెప్పాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'అప్పర్ భద్ర' నిర్మాణ పనులను ఆపడం చేతకాకుంటే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్ రెడ్డి, కెసిఆర్ రాజీనామా చేసి వెళ్లిపోవాలని హితవు పలికారు. శనివారం మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలో ఉన్న ఆర్‌డిఎస్ దగ్గర తుంగభద్రమ్మకు హారతి ఇచ్చి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పాదయాత్రతో అధికార, ప్రతిపక్షాలు స్పందించి కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర నిర్మాణ పనులను ఆపాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర నది నుంచి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఉన్న హెచ్‌ఎల్‌సి, ఎల్‌ఎల్‌సి ద్వారా ఎన్నో వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయన్నారు. అప్పర్ భద్ర నిర్మాణం చేపడితే చుక్క నీరు లేక, బోసిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారని తెలిపారు. చరిత్ర కలిగిన ఇటువంటి ప్రాజెక్టులు, కాలువలు సైతం సర్వ నాశనమవుతాయని చెప్పారు. రాయలసీమలో దాదాపు 52 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలు కంటే ఏది అత్యవసరం కాదని, వెంటనే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఉమ్మి సలీం, శ్రీకాంత్ రెడ్డి, సుజ్ఞానమ్మ, ఆవుల రాఘవేంద్ర యాదవ్, శ్రీధర్, సాయిబాబా, టిప్పు సుల్తాన్, షేక్షావలీ, సీమ కృష్ణ, వివి.నాయుడు పాల్గొన్నారు.

తుంగభద్రమ్మకు హారతిస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

వయో పరిమితి పెంచడం కాదు... ఉద్యోగాలివ్వండి : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వయో పరిమితిని పెంచడం మంచిదేనని, ఉద్యోగాలకు భర్తీ చేయకుండా యువతను మోసం చేయడం దారుణమని టిడిపి నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, అడ్వకేట్ కెటి.మల్లికార్జున మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల వయో పరిమితి సడలించిన తరహాలో ఈడబ్ల్యుఎస్ వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో వయో పరిమితిని ఐదేళ్లు సడలిస్తూ, సబార్డినేట్స్ సర్వీస్ రూల్స్‌ను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం మంచిదేనని తెలిపారు. కానీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను, నిరుద్యోగ యువతను మభ్య పెట్టడానికే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన జగన్ నేడు జాబ్ లెస్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగ యువతను మోసగించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హయాంలోనే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భూమి రెడ్డిని గెలిపించండి : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి తరఫున పోటీలో ఉన్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్ ఉన్నారు.

న్యాయవాది హైదర్ అలీపై చర్యలు తీసుకోవాలి

- న్యాయవాదులు, నోటరీలు

ప్రజాశక్తి - ఆదోని

లైసెన్స్ లేకున్నా నోటరీగా చెలామణి అవుతున్న న్యాయవాది హైదర్ అలీపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, నోటరీలు చిన్న ఈరన్న, ఆనంద్, నెట్టికంఠయ్య, రవి కృష్ణ, కెజి.వెంకటేష్, డి.చంద్రయ్య, జనార్ధన్ కోరారు. శనివారం ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్ష, జనరల్ సెక్రటరీ మల్లికార్జున, చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హైదర్ అలీ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి స్టాంప్ వెండర్‌గా లైసెన్స్ పొంది, ఇదే లైసెన్స్‌పై గత రెండు నెలలుగా ఫేక్ నోటరీగా చెలామణి అవుతూ నోటరీ అఫిడవిట్‌లు ఇస్తున్నారని తెలిపారు. స్టాంప్ వెండర్ లైసెన్స్‌పై నోటరీగా చెలామణి అవుతున్న హైదర్ అలీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. స్టాంపులు ఇవ్వరాదని సంబంధించిన కాపీలను జిల్లా, సబ్ రిజిస్ట్రార్లకు పంపినట్లు తెలిపారు.

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.68/2022 IN OS.NO.15/2018.

Between:
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...Petitioner/Plaintiff
V/S
Challa Yerri Swamy and Four others. ...Respondents/Defendants

To
Under Sec-5 of Limitation Act Notice.
R3) Smt. Danalakshmi w/o. Harshavardan, D/o. Yerri Swamy, age 35 years, R/o. H.No.6-106, Kothur Village, in Kodumur Mandalam, Kurnool Dist.
R4) Kum. Challa Sharada D/o. Yerri Swamy, age about 26 years,
R5) Kum. Challa Akhila D/o. Yerri Swamy, age about 24 years, Both are residents of H.nop.27/78, Ramchandra Puram Village, Rathana (post), Pattikonda Mandalam, Kurnool District.

The above named petitioner filed the above I.A. in the above suit against you and for others for grant of Ad-Interim Injunction from alienating, creating, any charge, transferring or mortgaging the petition schedule properties in favour of third parties till the disposal of the suit. For Sec-5 of Limitation Act for the condone the delay for restore the suit. You are hereby informed to appear before this Hon'ble court on 16.03.2023 at 10:30 am in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.

A.M. JANARDHAN GOUD,
S.VENKATA REDDY &
A. LAKSHMI NARAYANA
ADVOCATES, KURNOOL and ADONI

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.69/2022 IN OS.NO.15/2018.

Between:
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...Petitioner/Plaintiff
V/S
Challa Yerri Swamy and Four others. ...Respondents/Defendants

To
Under Order -9, Rule-9, C.P.C.
R3) Smt. Danalakshmi w/o. Harshavardan, D/o. Yerri Swamy, age 35 years, R/o. H.No.6-106, Kothur Village, in Kodumur Mandalam, Kurnool Dist.
R4) Kum. Challa Sharada D/o. Yerri Swamy, age about 26 years,
R5) Kum. Challa Akhila D/o. Yerri Swamy, age about 24 years, Both are residents of H.nop.27/78, Ramchandra Puram Village, Rathana (post), Pattikonda Mandalam, Kurnool District.

The above named petitioner filed the above I.A. in the above suit against you and for others for grant of Ad-Interim Injunction from alienating, creating, any charge, transferring or mortgaging the petition schedule properties in favour of third parties till the disposal of the suit. For restore the suit dismiss for default. You are hereby informed to appear before this Hon'ble court on 16.03.2023 at 10:30 am in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.

A.M. JANARDHAN GOUD,
S.VENKATA REDDY &
A. LAKSHMI NARAYANA
ADVOCATES,
KURNOOL and ADONI

రాష్ట్రపతితో గవర్నరు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గవర్నరు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఎపి భవన్ అదనపు కమిషనరు హిమాన్షు కౌశిక్ స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఢిల్లీ పర్యటనకు వచ్చారు. పర్యటనలో భాగంగా శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌తో గవర్నరు భేటీ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆదివారం భేటీ కానున్నారు.

కుమార్తెను చంపిన వ్యక్తిని శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళిత యువకుడిని ప్రేమించిందనే పేరుతో కుమార్తెను చంపి కాల్చి బూడిదను చెరువులో కలిపిన తండ్రి దేవేందర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి శనివారం ప్రకటన విడుదల చేశారు. దేవేందర్‌రెడ్డికి సహకరించిన వారినీ శిక్షించాలని కోరారు. సమాజంలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతుందని తెలిపారు. ఆడ పిల్లల ఆకాంక్షలను వివాహంలో వారి ఎంపికను గుర్తించాలని, గౌరవించాలని తెలిపారు. చదువులో, వస్త్రధారణలో అన్నింటా వారి ఇష్టాఇష్టాలను ఆమోదించే సంస్కృతిని పెంచుకోవాలని, ప్రభుత్వాల ఆంక్షలు పెట్టడానికి తిప్పి కొట్టాలని అన్నారు. దీనికోసం అందరూ కృషి చేయాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం (అనంతపురం)

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మృతుని భార్య వివరాల మేరకు.. దేవేంద్రపురానికి చెందిన బాలునాయక్ (40)కు 2.50 ఎకరాల పొలముంది. పంటల సాగు, వ్యవసాయ బోర్లు వేసేందుకు బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల నుంచి రూ.9.50 లక్షలు అప్పు తీసుకున్నారు. బోరులో నీరు ఎండిపోవడం, అప్పులు తీరే దారిలేక గురువారం తన పొలంలోనే పురుగుల మందు తాగారు. చికిత్స నిమిత్తం ఆయనను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఆయనకు

ఆ భూములన్నీ మావే...

- మరోసారి వివాదానికి తెరలేపిన టిటిడి
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్ల నిషేధం

ప్రభుత్వ జిఒతో రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో చేరిన తిరుపతి పద్మావతిపురంలోగల టిటిడి కల్యాణ మండపం సమీపంలోని ఇళ్లు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) మరో వివాదాన్ని తెరపైకి తెచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు వేల ఎకరాలకుపైగా భూములన్నీ మావే. వీటిని రిజిస్ట్రేషన్ చేయొద్దు' అంటూ గతేడాది ఫిబ్రవరిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. ఇందుకు సంబంధించి సుమారు 200 సర్వే నంబర్లను సమర్పించింది. ఈ లేఖపై దేవాదాయ శాఖ స్పందిస్తూ ఈ భూములన్నీ 22ఎ కింద ఉన్నాయని, వీటి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖకు నివేదించింది. దీంతో, ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ ఈ నెల తొమ్మిదిన ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల నిషేధం విధించిన వాటిలో సర్వే నంబర్ 11/2బి-2 అక్కారంపల్లిలోని 1200 ఎకరాలు, సర్వే నంబర్ 1, 2, 3, 4లో లీలామహల్ నుంచి బిటిఆర్ నగర్, శెట్టిపల్లి, మంగళం క్వార్టర్స్, కరకంబాడి వరకూ 700 ఎకరాలు, తిరుపతి బ్లిస్ స్టార్ హోటల్ నుంచి లక్ష్మీపురం జంక్షన్, పద్మావతిపురం వరకూ మరో 300 ఎకరాలు, నాగలాపురం, అప్పలాయగుంట, నారాయణవనంలోని రైతులకు సంబంధించి 250 ఎకరాలు ఉన్నాయి. నారాయణవనానికి చెందిన టిటిడి కల్యాణ మండపం సర్వే నంబర్ 83/12ఎ/2బి/4ఎలో మూడు ఎకరాల్లో ఉంది. అయితే సర్వే నంబర్‌లోని 30 ఎకరాల రిజిస్ట్రేషన్‌పైనా నిషేధం విధించింది. ఈ మూడు వేల ఎకరాల్లో 1100 ఎకరాలు సాగు భూములు ఉన్నాయి. వీటిని రైతులు ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 1900 ఎకరాల్లో ఇళ్లు, షాపులు, కొన్ని అపార్టుమెంట్లు ఉన్నాయి. పేదలు, ప్రయివేట్ వ్యక్తులు వీటిని నిర్మించుకున్నారు. ఈ వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా, ఎటువంటి విచారణా జరపకుండా రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ గుడ్డిగా ఈ ఆదేశాలు ఇచ్చిందని స్థానికులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు వారు సన్నద్ధం అవుతున్నారు. నిషేధం విషయమై తిరుపతి జిల్లాకు సంబంధించిన ఓ రిజిస్ట్రేషన్ అధికారిని 'ప్రజాశక్తి' ఫోన్‌లో సంప్రదించగా టిటిడి ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రకటించారు తప్ప, సబ్‌డివిజన్ చేసి ఉంటే గందరగోళం ఉండేది కాదన్నారు. 26 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సమస్య తలనొప్పిగా మారిందని, తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వమే గెజిటెడ్ నోటిఫికేషన్ ఇచ్చి సబ్‌డివిజన్ చేసి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ ఈ సమస్య ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు.

గతంలోనూ...

టిటిడి గతంలో కూడా ఇటువంటి వివాదాలకు తెరలేపింది. 'తిరుపతి అంతా టిటిడితే' అంటూ 2002లో అప్పటి ప్రభుత్వం 781 జిఒను జారీ చేసింది. టిటిడి విజ్ఞప్తి మేరకు ఈ జిఒ ఇచ్చింది. అప్పట్లో ఇది పెద్ద వివాదాస్పదమైంది. '781 వ్యతిరేక జిఒ పోరాట కమిటీ'గా స్థానికులు ఏర్పడి మూడు నెలల పాటు ఆందోళనలు చేయడంతో అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గి ఈ జిఒను ఉపసంహరించుకుంది.

వీఆర్‌ఎపై చేయి చేసుకున్న తహశీల్దార్

- ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు వేయలేదని దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు నమోదు కాలేదన్న కారణంతో విఆర్‌ఎపై తహశీల్దార్ చేయిచేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో చోటుచేసుకుంది. దీనిపై బాధితుడు, విఆర్‌ఎల సంఘం నాయకులు కలిసి సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుని వివరాల ప్రకారం.. కొమెరపూడికి చెందిన విఆర్‌ఎ కొరబండి శ్రీనివాసరావు కొంతకాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఫేస్‌యాప్‌లో హాజరు వేయలేదు. దీంతో కార్యాలయానికి రావాలని శ్రీనివాసరావుకు తహశీల్దార్ కె.నగేష్ కబురు చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో కార్యాలయానికి వచ్చిన శ్రీనివాసరావుపై తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎప్పుడు రమ్మంటే, నువ్వు ఎప్పుడు వచ్చావు?, పైగా ఫోన్ తీసుకురాకుండా ఎందుకొచ్చావు..?' అంటూ ఆయనపై చేయి చేసుకున్నారు. ఈ విషయాన్ని బాధితుడు శ్రీనివాసరావు విఆర్‌ఎల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అందరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్‌పై ఎస్‌టి, ఎస్‌సి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. విఆర్‌ఎపై చేయిచేసుకున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ సేవకుల సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు పి.సంజీవరావు, పి.రవి, సిద్ధయ్య, పి.మహేష్, ఎం.హరిపోతురాజు, జె.రాజ్‌కుమార్ ఉన్నారు. దాడిపై తహశీల్దార్ కె.నగేష్‌ను వివరణ కోరగా దాడి అవాస్తవమని అన్నారు. యాప్‌లో ఎందుకు రిజిస్టర్ చేసుకోలేదని మాత్రమే అడిగానని చెప్పారు.

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాల్సిందే

నిరసనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. స్థలాల లీజు పేరుతో జరుగుతున్నది కేంద్ర ప్రభుత్వ నగదీకరణ పథకమేనని విమర్శించారు. 33 సంవత్సరాల లీజు పేరుతో ఆర్‌టిసికి చెందిన వంద బస్సు స్టేషన్లను ప్రయివేట్ సంస్థలకు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణ నిర్ణయాలను ఆర్‌టిసిలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా ఏటా వెయ్యి అద్దె బస్సులు, ప్రయివేటు విద్యుత్తు బస్సుల ప్రవేశం, స్క్రాపింగ్ పాలసీ, యుటిఎస్ మిషన్లు వంటి వాటిని యాజమాన్యం వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. వడోదర మోడల్ పేరుతో గుజరాత్‌లోని ఎంతో విశాలమైన వడోదర బస్ స్టేషన్‌ను ప్రయివేట్ కన్సార్టియన్లకు అప్పజెప్పి ఆ బస్ స్టేషన్‌కు అన్ని ప్రయివేట్ బస్సులు వచ్చేలా ఏర్పాటు చేశారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనే ఇంటిగ్రేటెడ్ బస్ స్టేషన్ల పేరుతో వీటిపై అధ్యయనం చేశారని తెలిపారు. నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనువాసులురెడ్డి మాట్లాడుతూ.. విలీనం పేరుతో ఆర్‌టిసి ఆస్తులను కార్పొరేట్లకు అర్పణం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దివాకర్, కడప జోనల్ కార్యదర్శి భాస్కర్, నాయకులు పి.వి.నాదం, వైఎస్.రాజు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసికి మరో అవార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో ఎపిఎస్ ఆర్‌టిసి మరో అవార్డును సొంతం చేసుకుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన డిజిటల్ టెక్నాలజీ పోటీల్లో వివిధ ప్రభుత్వ సంస్థలతో పోటీపడి ఈ అవార్డును ఆర్‌టిసి దక్కించుకుంది. ఈ మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించడంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ముందంజలో ఉండటంలో భాగంగా ఇటీవల కాగిత రహిత సేవలను ప్రవేశపెట్టింది. యుటిఎస్ (యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్స్) ద్వారా డిజిటల్ చెల్లింపుల సౌలభ్యాన్ని కలిగించింది. ఇందుకు గానూ 2023 సంవత్సరానికి ఎంటర్ ప్రైజ్ అప్లికేషన్ విభాగంలో వరుసగా ఐదోసారి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డుకు ఎంపికైనట్లు ఎపిఎస్ ఆర్‌టిసి పేర్కొంది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు కాగిత రహిత టిక్కెట్లు సులభంగా జారీచేసే సౌలభ్యాన్ని ప్రయాణికులకు కల్పించి ఉత్తమ సేవలందిస్తున్నందుకు ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రశంసలు అందుకుంది. ఈ నెల 24న కొచ్చిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (అడ్మిన్) ఎ కోటేశ్వరరావు, డిప్యూటీ ఇంజినీరు (ఐటి) వై శ్రీనివాసరావు కలిసి సంస్థ తరపున అవార్డును అందుకున్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి వరుసగా ఈ అవార్డు అందుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

శనగ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల దగ్గర నిల్వవున్న శనగ పంటను క్వింటాకు రూ.6 వేల ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయలసీమ జిల్లాల్లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 8 లక్షల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారని తెలిపారు. రబీలో ఇతర పంటలకు అవకాశం లేని పరిస్థితుల్లో అనివార్యంగా శనగ పంటను సాగు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి శనగపంటను పండించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.5,335 కూడా దక్కడం లేదని పేర్కొన్నారు. శనగ రైతుల మధ్య దళారులకు క్వింటాకు రూ.4,500 కంటే తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. విత్తనం నుంచి విక్రయం దాకా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు అండగా ఉంటామని ఒక వైపు పేర్కొంటున్న ప్రభుత్వం మరొక వైపు ప్రకటనలకే పరిమితమవుతోందే తప్ప వాస్తవంగా రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. రైతులకు అండగా నిలవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

మండలి రద్దుకు కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

శాసన మండలి రద్దుకే తాము కట్టుబడి ఉన్నామని మత్స్యశాఖ, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనమండలి వృథా, రద్దు చేయాలని కోరిన వైసిపి ఇప్పుడు అభ్యర్థులను నిలబెట్టి ఓట్లు ఎలా అడుగుతారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. కౌన్సిల్ రద్దు కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఆమోదం రాలేదన్నారు. మండలిలో ఖాళీలను పూర్తి చేయాల్సి ఉన్నందున ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టామని చెప్పారు. కౌన్సిల్ రద్దు చేసినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

సమాజానికి బాలలు మానవ వనరులు

- వారి ఆసక్తి, అభిరుచులకు ప్రాధాన్యత ఇద్దాం
- గోదావరి బాలోత్సవం ప్రారంభ సభలో వక్తలు ఉద్ఘాటన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జి

బాలలు సమాజ సంపద, సమాజం ఆస్తి అని, వారిని సమాజభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రెండు రోజులపాటు జరగనున్న 'గోదావరి బాలోత్సవం' పిల్లల పండుగ శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ప్రారంభించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు వివిఎస్ కష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాబ్జి మాట్లాడుతూ బాలల రూపంలో ఉన్న మానవ వనరులను భవిష్యత్ సమాజానికి సద్వినియోగం చేసేలా ఇప్పటి నుంచే వారిలో ఆలోచన శక్తిని పెంపుదల చేసేందుకు దృష్టి సారించాలన్నారు. సెల్‌ఫోన్ ప్రపంచంలో బాల్యం శిథిలమైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలల్లో ఉన్న ఆలోచనా శక్తిని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, వారికున్న ఆసక్తిని, అభిరుచులను పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి బాలోత్సవం నిర్వాహకులు మురళీకష్ణ మాట్లాడుతూ నేటి విద్యావ్యవస్థ విద్యార్థులను ఏవో భ్రమలవైపు, భ్రాంతిలోకి తీసుకెళతోందని అన్నారు. విద్యార్థుల ఆసక్తిని తెలుసుకుని ప్రోత్సహించేలా తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దారి తప్పిన విద్యావ్యవస్థను సన్మార్గంలో పెట్టేందుకు అవసరమైన రీతిలో చైతన్యం తీసుకొచ్చేందుకు దోహదం చేసేలా బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సిసిసి ఎండి పంతం కొండలరావు, పిఎ రాజబాబు, ఎస్‌ఎస్‌ఆర్ జగన్నాథరావు, ఆలపాటి నాగేశ్వరరావు, డాక్టర్ తలారి వాసు, డాక్టర్ చైతన్య శేఖర్, పి.తులసి, తాడూరి శ్రీనివాస్, సూర్యనారాయణ, జివిఎల్ నరసింహారావు, ఖాదర్‌ఖాన్, సూర్యనారాయణ, గౌరీ, శ్రీనివాస్, పెరుమాళ్ల రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

ప్రజాశక్తి-కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరులపాడు మండలం జుజ్జూరుకు చెందిన కుంచం రామారావు (45) గ్రామంలో రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ప్రొక్లెయిన్ అద్దెకు తీసుకొని నడుపుతుంటారు. రామారావు వద్ద ప్రొక్లెయిన్ డ్రైవర్‌గా అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రామారావు భార్యతో ప్రొక్లెయిన్ డ్రైవర్ ప్రవీణ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రవీణ్ తన స్నేహితులైన పులి రాజేష్, బుచ్చిబాబుతో కలిసి రామారావు ఇంటికి వచ్చారు. ఇంటి బయట రాజేష్, బుచ్చిబాబును కాపలాగా ఉంచి ప్రవీణ్ లోనికి వెళ్లాడు. ఇంట్లో భార్గవి, ప్రవీణ్ ఏకాంతంగా ఉండటాన్ని రామారావు చూసి కోపోద్రిక్తుడయ్యాడు. ప్రవీణ్ కుమార్‌తో ఘర్షణపడ్డాడు. దీంతో ప్రవీణ్ తన స్నేహితులైన రాజేష్, బుచ్చిబాబుతో కలిసి రామారావుపై దాడి చేశారు. ఇందుకు భార్గవి కూడా సహకరించడంతో నలుగురూ కలిసి రామారావుని చితకబాదారు. తీవ్ర గాయాలపాలైన రామారావును బంధువులు నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రామారావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ నాగేంద్ర కుమార్ తెలిపారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రగతి నివేదికలు వెల్లడించిన అధికారులు
సాదా సీదాగా మండల సర్వ సభ్య సమావేశం
ఎంపిపి బోయ శారద

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎం పిపి బోయ శారద అన్నారు. శనివారం కల్లూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి బోయ శారద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రధానంగా వేసవికాలంలో ఎదురయ్యే నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుని సిద్ధంగా ఉండాలని ఎంపిపి బోయ శారద అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఒ చంద్రశేఖర్ రెడ్డి జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి వివిధ శాఖల మండల అధికారులు, ఎంపిపి సభ్యులు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

గొర్రెపిల్లల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అగ్నిప్రమాదంలో కాలి చనిపోయిన గొర్రెపిల్లల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురువసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కంబదూరు మండలంలోని ఎగువపల్లి గ్రామానికి చెందిన గొల్ల బడప్ప, కురుబ రాము, కురుబ రంగారెడ్డి అనే గొర్ల కాపర్లకు సంబంధించిన దాదాపు 120 గొర్రె పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో చింత చెట్టుకింద ఉన్న ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో , ఆ మంటలు వ్యాప్తి చెంది గొర్రె పిల్లలన్నీ కాలి బూడిద అయ్యాయని తెలిపారు. కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని గుడిసె శివన్న ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారుగా రూ.ఐదు లక్షల ఆస్థి నష్టం వాటిల్లిందని బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని కోరారు. ఈ విషయమై సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి బాధిత గొర్రెల కాపర్లకు జరిగిన నష్టంపై విచారించి, న్యాయం జరిగేలా సత్వర చర్యలు చేపట్టాలని గుడిసె శివన్న కోరారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో గవర్నమెంట్ ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు తప్పకుండా గొర్రెల కాపరులను ఆదుకోవాలని శివన్న కోరారు.

28న టైలర్స్ డే ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద గల ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్ నందు ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు టైలర్స్ డేను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఖలీల్ బాషా చెప్పారు. శనివారం స్థానిక ఉర్దూగర్ ఫంక్షన్ హాలులో కర్నూలు జిల్లా టైలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఖలీల్‌బాషా అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశంలో టైలర్స్ డే పోస్టర్ విడుదల చేశారు. ఈ టైలర్స్ డేకు కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై.రామయ్య, శ్రీ బాల సాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ టి రామారావు, కర్నూలు వైసిపి రాష్ట్ర నాయకులు అబ్దుల్ జబ్బర్ ఫరూక్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. కావున ఈ సందర్భంగా టైలర్ షాప్ ఓనర్లు, షాపులో పనిచేసే వర్కర్లు, మహిళా టైలర్లు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా షాపులు బంద్ చేసి కర్నూలులో జరిగే టైలర్స్ డే ఫంక్షన్ లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు ఫరూక్, జిల్లా ఉపాధ్యక్షులు నేషనల్ బాష, జిల్లా ఉపాధ్యక్షులు బెనర్జీ, వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బిటిఎన్ నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామకష్ణ జిల్లా కోశాధికారి కాసిం, జిల్లా కార్యదర్శి సైపుల్ల జిల్లా కార్యదర్శి రంగా జిల్లా కార్యదర్శి పి. హుస్సేన్, జిల్లా కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మన్సూర్,జిల్లా సహాయ కార్యదర్శి బాపు, టైలర్ ఆచారి, వీరస్వామి, కెవిఆర్ టైలర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో నిత్యా సాధన తో నే పతకాలు సాధ్యం

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

ప్రతి రోజు తైక్వాండో సాధనతోనే చక్కటి ప్రతిభగల క్రీడాకారులు గా ఎదుగుతారని ప్రముఖ హైకోర్టు న్యాయవాది , నూతనంగా ఎన్నికైన జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు కెఇ.జగదీష్ కుమార్ అభిప్రాయ పడ్డారు. శనివారం కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 40వ సబ్ జూనియర్ , 5వ క్యాడెట్ జిల్లా స్థాయి తైక్వాండో బాల బాలికల పోటీలను కెఇ.జగదీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర దారుద్యానికి మానసిక ఉల్లాసానికి ఆత్మరక్షణకు తైక్వాండో క్రీడా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలని అన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, స్కేటింగ్ సంఘం కార్యదర్శి పి. సునీల్ కుమార్ , తైక్వాండో జిల్లా కార్యదర్శి శోభన్ బాబు, తైక్వాండో కోశాధికారి మహమ్మద్ పాషా, సీనియర్ మాస్టర్లు విజయబాబు, సుందర్రాజు, ఆర్గనైజర్ జి.కేహితి, విద్యార్థుల తల్లిదండ్రులు 200 క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 11నుండి విశాఖపట్నంలోని యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శోభన్ బాబు తెలిపారు

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి: సిఐటియు

ప్రజాశక్తి-తుగ్గలి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు మండల అధ్యక్షులు రంగస్వామి, కార్యదర్శి ప్రతాప్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్ సి అభ్యర్థి పోతుల నాగరాజు ఇంటర్మీడియట్ స్థాయి నుంచి విద్యార్థి నాయకుడిగా విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు చేశారన్నారు. వీటి కోసం 1990 సంవత్సరంలో 16 రోజులు, 1990 ర్యాగింగ్ వ్యతిరేక ఉద్యమంలో మూడు రోజులు, సంక్షేమ హాస్టల్ రద్దుకు వ్యతిరేక ఉద్యమం చేశారన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో నాలుగు రోజులు జైలుకు వెళ్లారన్నారు. అటువంటి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడే నాగరాజుకు పట్టభద్రులు ఆలోచించి పిడిఎఫ్ అభ్యర్థికి తమ ఓటును వేయాలని వారు కోరారు.

ఎరువులు , పురుగు మందుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -వెల్దుర్తి

కర్నూలు జిల్లా వెల్దుర్తి పట్టణంలో ఎరువులు ,పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం అకస్మికంగా దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ కేశవరెడ్డి ఆధ్వర్యంలో దుకాణాలలో రిజిస్టర్లను, స్టాకు బోర్డులను, లైసెన్సలను, అనుమతి పత్రాలను, గోడౌన్‌లలో ఉన్న ఎరువులు .,పురుగు మందుల నిల్వలను తనిఖీ చేశారు. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణములో యూరియా ,డి ఏ పి ఎరువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మినందుకు 5 బస్తాల యూరియా , 20 బస్తాల డిఎపి రూ. 28,332 అమ్మకాలను నిలుపుదల చేస్తూ కేసు నమోదు చేశారు. ఎమ్మార్పీకి మించి విక్రయించకూడదని, అనుమతి ఉన్న ఎరువులు , పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ

ఎరువులను ఈ పాస్ ద్వారా మాత్రమే విక్రయించి రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. విజిలెన్స్ అధికారులు సిద్దయ్య , జయన్న , మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా లు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను వేగవంతం చేసుకోండి : ఇఒ

ప్రజాశక్తి-సి బెళగల్

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని హౌసింగ్ ఎఇ సుమంత్ శనివారం లబ్దిదారులకు సూచించారు. బురాన్‌దొడ్డిలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సమక్షంలో ఇళ్ల పనులను పరిశీలించి లబ్ధిదారులతో చర్చలు కొనసాగించారు. ఇక్కడే ప్రభుత్వం తలపెట్టిన లక్ష్యం దిశగా ఇళ్లను పూర్తి చేసుకొంటే సకాలంలో బిల్లులు అందుకోవచ్చని పేర్కొన్నారు.

బిఇడిసెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ బిఇడి మూడో సెమిస్టర్ , జూన్ 2022లో రివాల్యుయేషన్ ఫలితాలు శనివారం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఏ ఆనందరావు విడుదల చేశారు. 971 మంది విద్యార్థులకు గాను 495 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సీజనల్ హాస్టల్లో విద్యార్థులకు వసతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పశ్చిమ ప్రాంతాల్లో వలస వెళ్లే కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లలో ఏర్పాటుచేసి వసతి కల్పిస్తామని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ జిల్లాలో 71 సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేసి అందులో దాదాపుగా3550 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నామన్నారు. కోసిగిలో తక్కువగా హాజరు శాతం నమోదు కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుండి వివరణ తీసుకుందామన్నారు. అక్కడ జాతర జరుగుతున్న నేపథ్యంలో తక్కువ హాజరు శాతం నమోదు కావడం జరిగిందన్నారు.వలస వెళ్లే కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తప్పనిసరిగా సీజనల్ హాస్టల్ ద్వారా వసతి కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

చలో విజయపాల డెయిరీ చేపడతాం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అక్రమంగా తొలగించిన విజయ పాల డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో చలో పాల డెయిరీ కార్యక్రమాన్ని చేపడతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు హెచ్చరించారు. నంద్యాలలోని కలెక్టర్ కార్యాలయం ముందు విజయ పాల డెయిరీలో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన నిరాహార దీక్ష శనివారం 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా విజయ పాల డెయిరీ యాజమాన్యానికి, జిల్లా లేబర్ అధికారులకు, జిల్లా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదన్నారు. గత 20 సంవత్సరాల నుండి పని చేసిన 9 మంది దళిత కార్మికులను యాజమాన్యం అకారణంగా అధికార దర్పంతో తొలగించి, కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న విజయ పాల డెయిరీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలన్నారు. విజయ పాల డెయిరీ కార్మికులు గొంతెమ్మ కోరికలు ఏమి కోరడం లేదని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరాహార దీక్షలో కార్మికులు నాగరాజు, బాలసుబ్బయ్య, ప్రసాదు, ఇస్సాకు, శేఖర్, కరుణాకర్, కలందర్, రవిశంకర్ తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శులు వెన్న బాల వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు

నాడు కళకళ.. నేడు వెలవెల..

- రెండు తరగతులకు ఇద్దరే పిల్లలు - విద్యా బోధనకు ఒక ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

విద్యా విధానంలో నూతన మార్పులు రాక ముందు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతుండేవి. ఇటీవల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయి కళావిహీనంగా మారి వెలవెల బోతున్నాయి. 3,4,5 తరతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. రుద్రవరం మండలం తుమ్మల కొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యావిధానం అమలు చేయకముందు 1 నుంచి 5వ తరగతి వరకూ విద్యా బోధన జరుగుతుండేది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు దాదాపు బాల బాలికలు 14 మంది విద్యనభ్యసిస్తుండేవారు. నాడు బాల బాలికలతో పాఠశాలలోని తరగతి గదులు, ఆవరణం కళకళాలాడుతుండేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన నూతన విద్యా విధానం తర్వాత తుమ్మలకొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లావత్తుల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో 3,4,5వ తరగతుల విద్యార్థులు 12 మంది ప్రతి రోజూ 2 రెండు కిలోమీటర్లు దూరం నడుచుకుంటూ ఎల్లావత్తుల గ్రామానికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక పాఠశాలలో 1,2 తరగతులకు ఇద్దరు మాత్రమే చదువుకుంటున్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నారు. నూతన విద్య విధానం నిబంధనల ప్రకారం పాఠశాలలో 10 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే ఆ పాఠశాలలను మూసివేయనుండడంతో నేడు తుమ్మలకొట్టాల ప్రాథమిక పాఠశాలకు తాళం తప్పదేమోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

తరగతి గదిలో ఇద్దరే ఉన్న పిల్లలు

పాఠశాల

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- 769 బస్తాలు సీజ్
- ఇద్దరు వ్యాపారస్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి - అవుకు

పట్టణంలోని బిసి వెంకటసుబ్బయ్య ఫర్టిలైజర్స్, ఎంసిఎస్ నరసింహులు ఫెర్టిలైజర్స్ దుకాణాలను విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. విజిలెన్స్ సిఐ నాగరాజు యాదవ్ బృందం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. యూరియా, డిఏపి మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న రైతుల సమాచారం మేరకు ఈ రెండు దుకాణాలపై దాడులు చేపట్టారు. ఎంసిఎస్ నరసింహులు ఫెర్టిలైజర్స్ దుకాణంలో యూరియా గవర్నమెంట్ నిర్ణయించిన ధర 267 రూపాయలు ఉండగా 320 రూపాయలకు బస్తా అమ్ముతున్నట్లు గుర్తించామని, బిసి వెంకట సుబ్బయ్య ఫర్టిలైజర్స్ దుకాణంలో డిఎపి ధర 1347 రూపాయలకు గాను రూ.1400లకు అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. యూరియా 666 బస్తాలు, డిఎపి 103 బస్తాలను సీజ్ చేసి రెండు దుకాణాలకు చెందిన వ్యాపారస్తులు ఎంసిఎస్ నరసింహులు, బచ్చు నాగరాజులపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఈ రెండు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు పలుమార్లు దాడులు చేసి కేసులు నమోదు చేసినప్పటికీ కూడా మళ్లీ మళ్లీ అదే తప్పులు చేస్తూ ప్రతి సంవత్సరం పట్టుబడడం పరిపాటిగా మారిందని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రెండు దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకొని మళ్లీ ఇటువంటి తప్పులు జరగకుండా చూడాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎగువ అహోబిలంలో

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో శనివారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశ్వక్సేనుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న మండపం వద్దకు విశ్వక్సేనుని ఊరేగింపుగా తీసుకొచ్చి మండపంలో ఆశీనులను చేసి హారతి అందజేశారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మహాసంకల్పం, శుద్ధ పుణ్యాహ వాచన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మండపంలోని మట్టిని సేకరించి ఆలయ అర్చకులు వేదపండితులు పాలికలతో నవధాన్యములు కలిపి పూజలు నిర్వహించారు. జిపిఎ సంపత్, మేనేజర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

ఎస్ఎస్‌సిలో వంద శాతం తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డిఇఒ సిజె.క్రిస్టఫర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.దస్తగిరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యా శాఖ అధికారి సిజె.క్రిస్టఫర్

ఎన్నికల వేడి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి త్వరలో ఎన్నిక జరగనుంది. ఎన్నికల పర్వంలో ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. దాఖలైన నామినేషన్లను పరిశీలించిన అధికారులు ఆమోదించిన, తిరస్కరించిన నామినేషన్ల జాబితాను కూడా విడుదల చేశారు. దీంతో బరిలో నిలిచిన వారి పేర్లు దాదాపుగా ఖరారు అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా వాటిలో ఒకరి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. వైసిపి తరుపున నామినేషన్ దాఖలు చేసిన మధుసూదన్‌తో పాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఆ స్థానానికి బరిలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థులు కూడా ఖరారయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 51 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్షంతో పాటు పలువురు అభ్యర్థులు ప్రచారంలో మునిగిపోయారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్, ప్రజా సంఘాలు బలపరచిన అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరచిన కత్తి నరసింహారెడ్డి ప్రచారంలో ముందంజలో ఉన్నారు. అధికారపక్షం జిల్లాకు చేసిందేమీ లేకపోగా మరోవైపు భారాల పేరుతో సామాన్యుల నడ్డి విరిచింది. నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసింది. జిల్లాలోని ఏ పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు చేపట్టలేదు. ప్రతిపక్షం కూడా గతంలో అధికారంలో ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి చేసిన చర్యలు నామ మాత్రమే. ప్రస్తుతం శాసనమండలిలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులు నిరుద్యోగుల, ఉద్యోగుల, యువకుల, సామాన్యుల సమస్యలపై ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు కూడా పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులను ఎన్నుకోవడం ద్వారా ప్రజా సమస్యలను మరింతగా మండలిలో వినిపించేందుకు అవకాశం దక్కనుంది.

కేంద్ర బడ్జెట్ పై నిరసనలు :

బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగింది. ప్రత్యేక హోదా విభజన హామీలలో వేటినీ ఈ బడ్జెట్లో ప్రస్తావించలేదు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి నిధులు కేటాయించకపోగా కర్ణాటకలో నిర్మిస్తున్న అప్రభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి రూ.5300 కోట్లను కేటాయించారు. ఆ ప్రాజెక్టు వల్ల తుంగభద్ర దిగువకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోతుంది. దీంతో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు ఎడారులుగా మారే ప్రమాదం ఉంది. కేంద్ర బడ్జెట్, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

అవీ.. ఇవీ... అన్నీ..

ఎస్సై ఉద్యోగాల నియామకానికి ప్రిలిమ్స్ రాత పరీక్షను నిర్వహించారు. చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడంపై టిడిపి నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

పాడి రైతులకు బోనస్ మంజూరు

ప్రజాశక్తి - రుద్రవరం

మాట్లాడుతున్న మేనేజర్

విజయ పాల డైరీకి పాలు పోస్తున్న రుద్రవరం మండల రైతులకు రూ.25 లక్షల 77 వేల 160 బోనస్ మంజూరైనట్లు రుద్రవరం విజయ పాల డైరీ మేనేజర్ శివ శంకర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు 13 లక్షల 6 వేల 230 లీటర్ల పాలను విజయ డైరీకి పోశారన్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో లీటరుకు 2 రూపాయల ప్రకారం బోనస్ మంజూరు అయిందన్నారు. ఈ మొత్తాన్ని 42 కేంద్రాలలో పాలు పోస్తున్న రైతులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని కేంద్రాలలో రైతులకు బోనస్ ఇచ్చామని, పాల డైరీ నిర్వాహకులు రైతులకు మంజూరైన బోనసును దుర్వినియోగం చేయకుండా పాలు పోసిన ప్రతి రైతుకు లీటరుకు 2 రూపాయల ప్రకారం తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు.

28 కల్లా ఈకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండలంలో రబీ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతులు ఈ నెల 28వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్లో జొన్న పంట పండించిన రైతులు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, రైతు భరోసా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. మద్దతు ధర రూ.2970 అందిస్తున్నారని,రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గృహ ప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని మొత్కులపల్లె గ్రామంలో శనివారం జరిగిన మార్తల రమణ రెడ్డి నూతన గృహ ప్రవేశం వేడుకలకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి హాజరయ్యారు. అలాగే వైసిపి మండల కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నేత బసాపురాం అబ్దుల్ సలాం, నంద్యాల జిల్లా పరిధిలోని సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీలకతీతంగా పలువురు ముఖ్య నేతలు, అధికారులు, బంధుమిత్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో మందాల శివారెడ్డి, మెరగ నాగ భూషణం రెడ్డి, కందుల ప్రసాద్ రెడ్డి, జింకల నాగన్న, పెద్ది రమణయ్య, అర్ రామాంజనేయ రెడ్డి, ఎల్‌వి కృష్ణయ్య, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించాల్సిన బాధ్యత గృహ సారథులదేనని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో గృహ సారుదులు, కన్వీనర్లు, వాలంటీర్లతో వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిశీలకులు బోరెడ్డి నరసింహారెడ్డి, నంద్యాల మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలనే విషయంపై దిశా నిర్దేశం చేశారు. గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. నూటికి 94 శాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వాన్ని తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిశీలకులు బోరెడ్డి నరసింహారెడ్డి, విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్ మోహన్ రెడ్డిలు మాట్లాడారు. సమావేశంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, మండల ఉపాధ్యక్షులు నాసారి ప్రసాద్, దాదాపీర్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - శ్రీశైలం

భ్రమరాంబ అతిథి గృహం వద్ద శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చిన చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ధనుంజయ వై.చంద్రచూడ్, ఆయన సతీమణి కల్పనా దాస్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యకార్యదర్శులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ వై. లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన, దేవాదాయశాఖ కమిషనర్ ఎం. హరి జవహర్ లాల్, కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎన్. శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ధనుంజయ వై. చంద్రచూడ్ వెంట సుప్రీంకోర్టు జడ్జి పిఎస్ నరసింహా, ఆయన సతీమణి సత్యప్రభలకు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్, జడ్జి పిఎస్.నరసింహులు శ్రీశైలం పర్యటనలో భాగంగా ముందుగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డికి స్థానిక భ్రమరాంబ అతిథి గృహంలో వారికి నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

శ్రీశైలం చేరుకున్న వారు ఆదివారం భ్రమరాంబ, మల్లికార్జునను దర్శించుకుంటారు.

రుద్రవరం ఇన్‌ఛార్జి ఎంఇఒగా రామసుబ్బయ్య

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల ఇన్‌ఛార్జి ఎంఇగా రామసుబ్బయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంచార్జి ఎంఇఒగా ఉన్న ఆళ్లగడ్డ ఎద్దుల పాపమ్మ మద్దిలేటి రెడ్డి ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరామిరెడ్డి స్థానంలో మహానంది ఎంఇఒ రామసుబ్బయ్యకు ఇన్చార్జి ఎంఇఒగా నియమిస్తూ విద్యాశాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్చార్జ్ ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించిన రామసుబ్బయ్యను మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, రుద్రవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

27, 28న నిరాహార దీక్షలు

నంద్యాల కలెక్టరేట్ : అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఈ నెల 27, 28వ తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సమతా సేవాదళ్ పట్టణ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమతా సేవాదళ్ ఆధ్వర్యంలో చేపట్టే నిరాహార దీక్షల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

27, 28న ఆధార్ స్పెషల్ క్యాంప్

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్, వైస్సార్ నగర్, ఏకలవ్యనగర్, వెంకటచలం కాలనీలల్లో ఈ నెల 27, 28వ తేదిలలో ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ఆధార్ అప్డేట్ చేయించుకొని వారు 41,129 మంది ఉన్నారని, వారందరూ ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

ఒక్క రూపాయి డాక్టర్‌ను గెలిపించండి : ఎపిటిఎఫ్

బనగానపల్లె : ఒక్క రూపాయికి వైద్యం చేస్తున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డికు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు ,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె. వెంకట కృష్ణుడు, ఇ.సుంకన్న, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ పొలంబడి క్షేత్ర దినోత్సవం

కొలిమిగుండ్ల : మండలంలోని నందిపాడు, హనమంతగుండెం, బోయ ఉప్పలురు, పెద్దవెంతూర్ల,,బెలుం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రబీ పొలంబడి క్షేత్ర దినోత్సవం మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తన పొలం పరిసరాల విశ్లేషణ చేసి స్వంత నిర్ణయం తీసుకోవాలని అవగాహన కల్పించారు. రసాయన పురుగు మందుల వినియోగం కంటే జీవన పురుగు మందులకు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అన్ని రైతూ భరోసా కేంద్రాల ఇంఛార్జిలు, పొలంబడి రైతులు రామిరెడ్డి నాగేశ్వర రెడ్డి, నందిపాడు సర్పంచి గురివిరెడ్డి, ఎంపిఇఒ నాగరాజు, వ్యవసాయ విలేజ్ అసిస్టెంట్లు తదితరలు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

సిరివెళ్ల : చిన్నారులకు తల్లిదండ్రులు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అలాగే సిరివెళ్ల, ఎర్రగుంట్ల, గాజులపల్లె ఆరోగ్య కేంద్రాల పరిధిలో 14 సెషన్ సైట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం ఖచ్చితంగా ఇమ్యునైజేషన్ సెషన్ నిర్వహించాలని సూచించారు. టీకాలు అందించడం వల్ల పోలియో, కోరింత దగ్గు, టెటనస్, డిఫ్తీరియా, నీళ్ల విరోచనాలు. హెపటైటిస్, మెదడు వాపు నిమోనియా లాంటి జబ్బులనుండి పిల్లలకు రక్షణ కల్పించవచ్చని తెలిపారు. హైరిస్క్ గర్భవతులను గుర్తించి బర్త్ ప్లాన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి, సూపర్వైజర్లు రవి కిషోర్, అమీనాబి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గాను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని లింగందిన్నె రోడ్డులో ఉన్న ఈద్గాను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఈద్గాలో 33 కెవి విద్యుత్ వైర్లు అడ్డంగా ఉండడం వల్ల ఇబ్బందిగా ఉందని జామియా మసీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించారు.. విద్యుత్తు లైన్లు త్వరితగతిన మార్చి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి, జామియా మసీదు పెష్ ఇమామ్ జాఫర్ సాధిక్, జామియా మసీద్ కమిటీ కార్యదర్శి అమీర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

మోటార్ బైకు, ట్రాక్టర్ ఢీ - వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు సమీపంలోని ఎనిమిదిగండ్ల మోరి వద్ద మోటార్ బైకు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది.. వివరాలు.. ఆళ్లగడ్డలో జరిగే వివాహ వేడుకలకు కంపమల్ల గ్రామం నుండి బైకుపై కాకర్ల నారాయణస్వామి, మాధవరెడ్డిలు వెళుతుండగా దొర్నిపాడు సమీపంలోని ఎనిమిది గండ్ల మోరి వద్ద గల పొలం నుండి పొట్టులోడుతో వేగంగా రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొంది. దీంతో బైక్ వెనుక వైపు కూర్చున్న కాకర్ల నారాయణస్వామి(60) కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. నారాయణస్వామి కుమారుడు కాకర్ల మల్లికార్జున కుమార్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రంగయ్య కేసు నమోదు చేశారు.

నేడు మంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామలయ : మండలంలోని మంగపల్లి గ్రామంలో నేడు ఆదివారం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ దస్తగిరి రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్త్రీవ్యాధి, , పిల్లలు, ఎముకలు, చర్మవ్యాధి, కంటి వ్యాధి, దంతవ్యాధి తదితర వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా వి.రామచంద్రరావు

ప్రజాశక్తి - నంద్యాల లీగల్ : నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నంద్యాల పట్టణ న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించిందని తెలిపారు. నంద్యాల జిల్లా న్యాయవాదులు, టిడిపి కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

మోహన్ రెడ్డి మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న నేతలు

మాజీ పాత్రికేయుడు మోహన్ రెడ్డి మృతి

- పలువురు నివాళి

మోహన్ రెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - పాములపాడు

మాజీ పాత్రికేయుడు మోహన్ రెడ్డి (52) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయన మృతికి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఏ. హరి సర్వోత్తమరావు, మాజీ సర్పంచ్ ఏ విజయసింహారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు బి రామేశ్వరరావు, మండల కార్యదర్శి సామన్న, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి సి హనుమంతు, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసేపు, మధు, వైసిపి నాయకురాలు భూమా రాములమ్మ, తెలుగు యువత మండల అధ్యక్షులు మధు కృష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, పాత్రికేయులు నాగయ్య, కాఖామొహిద్దిన్, మల్లికార్జున శెట్టి, మౌలా హుస్సేన్, చంద్రయ్య, షఫి, ఇస్మాయిల్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ రెడ్డి ఈనాడు, ప్రజాశక్తి దిన పత్రికలలో రిపోర్టర్‌గా పనిచేశారని గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

పట్టణంలో జరిగిన వేరువేరు రోడ్డు ప్రమా దాలలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చాగలమర్రి పట్టణం గుండా సాగే 40వ జాతీయ రహదారిపై కూలురు రస్తా వద్ద కడప జిల్లా రాజుపాలెం మండలం కుమ్మరిపల్లెకు చెందిన జయరామిరెడ్డి, శ్రీనివాసులు తమ ద్విచక్ర వాహనంపై చాగలమర్రికి వస్తూ కూలురు రస్తా వద్ద జాతీయ రహదారిపై హైదరాబాదు నుండి కడప వైపు వెలుతున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన జయరామిరెడ్డి, శ్రీనివాసులును స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. జయరామిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు. అలాగే జాతీయ రహదారిపై ఎస్‌కేఆర్ డాభా సమీపంలో చాగలమర్రి కి చెందిన హుసేన్ బాష,మహబూబ్‌బాషలు తమ ద్విచక్ర వాహనంపై ప్రొద్దుటూరు కు వెళుతుండగా అదే రహదారిలో కర్నూలు నుంచి చిత్తూరుకు వెలుతున్న అల్ట్రా డీలక్స్ ఆర్‌టిసి బస్సు ఢీకొంది. గాయపడ్డ వీరిని స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకొని విచారణ చేపట్టారు.

వసతులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని శనివారం నాడు ఆత్మకూర్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. వసతి గృహంలో విద్యార్థినిలకు అందుతున్న సేవలను గూర్చి ఆయన విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని మెనూ ప్రకారం భోజనాలు అందించాలని పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రంగస్వామి, బలరాం, రాథోడ్, హుస్సేన్ మియ,ా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగదు

- యాదవ సంఘం

ప్రజాశక్తి - ప్యాపిలి

బీసీలకు పెద్దపీట అని చెప్పుకునే వైఎస్ఆర్‌పి ప్రభుత్వం బీసీలపై అక్రమ అరెస్టులు తగదని ప్యాపిలి మండల యాదవ సంఘం నాయకుడు రాంమోహన్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన అంబాపురం శ్రీనివాసులు యాదవ్‌ను కక్షగట్టి వారికి ప్రబోజల్స్ వేసిన బిసి కౌన్సిలర్లు ఎంపీటీసీలను పోలీసుల సహాయంతో భయభ్రాంతులకు గురిచేసి ప్రభోజల్స్‌ను విత్ డ్రా చేయించడం సిగ్గుచేటని అన్నారు. బుగ్గన సొంత నియోజకవర్గంలో బీసీలు నామినేషన్ వేయడం ఆయన జీర్ణించుకోలేక బీసీలు ఎదుగుదలను చూచి ఓర్వలేకపోతున్నారని అన్నారు. రాబోయే కాలంలో వారికి బీసీలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈకార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు కోదండరామయ్య యాదవ్, పుల్లారెడ్డి యాదవ్, నాగేంద్ర, రమణయ్య యాదవ్, కంబగిరి రాముడు యాదవ్, రంగారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతతో నాడు నేడు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

నాడు నేడు పనులులో నాణ్యతతో చేపట్టాలని తహశీల్దార్ భారతి, ఎంఇఒ సుభాన్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను, ఉర్దు పాఠశాలలోని నాడు నేడు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో నాడు నేడు పథకం ద్వార చేస్తున్న పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు, విద్య కమిటి సభ్యులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చారించారు. విద్యార్థులతో కలిసి బోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజర్ శాతని రికార్డులను పరిశీలించారు. అలగే పగిడ్యాల ఎంపిపి మెయిన్ పాఠశాలలోని రెండవ తరగతి విద్యార్థులచే చదవడం, రాయడం ఎలాని విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహశీల్దార్, ఎంఇఒ

ప్రజాస్వామ్యబద్ధంగా వస్తారా? దాడులకే వస్తారా?

డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి సవాల్

ప్రజాశక్తి-డోన్

'ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయం చేస్తామంటే మేము సిద్ధం.. దాడులకే వస్తామంటే మీరు ఏ ప్లేస్‌కు రమ్మన్నా మేము సిద్ధంగా ఉన్నాం.' అని టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బేతంచేర్ల టిడిపి కార్యాలయంపై వైసిపి నాయకులు దాడికి ప్రయత్నించిన సంఘటనపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి , టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ మాట్లాడారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలో టిడిపి కార్యాలయం పై ఆర్థిక మంత్రి అనుచరులు దాడికి ప్రయత్నించడంతో డోన్ నియోజకవర్గ ప్రజలకు ఆర్థికమంత్రి నిజస్వరూపం బట్టబయలు అయిందని అన్నారు. బిసిల ఎదుగుదలను ఓర్వలేకనే ఆర్థిక మంత్రి కె.శ్రీనివాసులు ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ వేశారనే ఉద్దేశ్యంతో కక్ష సాధింపు చర్యలో భాగంగా ప్రతిపాదించిన వారు బిసి, ఎస్‌సిలు అయినందున పోలీసులను అడ్డం పెట్టుకొని చిత్రహింసలు పెట్టి నామినేషన్ తిరస్కరణ అయ్యే విధంగా చేశారని అన్నారు. అయినప్పటికీ మా కౌన్సిలర్లను పోలీస్ స్టేషన్ నుండి

మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

తీసుకుపోవడానికి బేతంచెర్లకు రాగా పోలీస్ అధికారులు 10 నిమిషాలు తరువాత పంపిస్తామని చెప్పారు. అదేవిధంగా తాము బేతంచెర్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉండగా పోలీసు అధికారులు వచ్చి "లా అండ్ అర్డర్ ప్రాబ్లంగా ఉందని" మమ్మల్ని రిక్వెస్ట్ చేస్తే అక్కడి నుండి వెళ్ళామని అన్నారు. తాము లేని సమయంలో ఆర్థికమంత్రి అనుచరులు టిడిపి కార్యాలయం దగ్గరకు వచ్చి దాడులకు ప్రయత్నించడం సిగ్గు చేటని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయం చేస్తామంటే మేము సిద్ధం, కానీ దాడులకే వస్తామంటే మీరు ఏ ప్లేస్‌కు రమ్మన్నా మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ , ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య , మాజీ ఎంపిపి దేవరబండ వెంకటనారాయణ గౌడ్ , నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున , నంద్యాల జిల్లా బిసి సెల్ కమిటీ నాయకులు జయ్యన్న యాదవ్ , డోన్ నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ఎర్రమల నాయుడు , నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు , డోన్ నియోజకవర్గ టిడిపి రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య,అంబాపురం సర్పంచి శ్రీనివాసులు యాదవ్, డోన్ మండలం టిడిపి ఉపాధ్యక్షులు మిద్దపల్లె గోవిందు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు

రాష్ట్రంలో లక్షలాదిమంది ఆటో కార్మికులు ఉన్నారని వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, రైతు, వ్యకాస జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద ఉన్న స్టాండ్ నుండి 40 మంది ఆటో కార్మికులు సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె భాస్కర్ రెడ్డి, రైతు, వ్యకాస జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీర్ సాహెబ్ మాట్లాడారు. డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు సరైన ఉద్యోగాలు దొరకక పొట్టకూటి కోసం ప్రైవేటు ఫైనాన్సో అప్పులు చేసి ఆటోలు నడుపుతున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ

మాట్లాడుతున్న నాయకులు

బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు, అనారోగ్య పాలైన, ప్రభుత్వాల నుండి ఎటువంటి సహాయం అందక అప్పులు అవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తక్షణమే ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నికయ్యింది. అప్పి ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా రమేష్, కార్యదర్శిగా స్వీటు రమేష్, ఉపాధ్యక్షులుగా బి.చిన్న స్వాములు, దానం, ట్రెజరీగా కరుణాకర్, 11 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చిన్న రాజు, దశరథులు, మహేష్, రామచంద్రుడు, రియాజ్ తదితర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

28 లోపు ఈ కేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈనెల 28 లోపు రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022 -23 సంవత్సరంలో రబీ సీజన్ సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసిన రైతులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండలంలో ఇంతవరకు 75 శాతం రైతులు ఈ కేవైసీ చేయించుకున్నారని ఆయన తెలిపారు. మిగిలిన రైతులు ఈనెల 28 కంతా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సమీపాన రైతు భరోసా కేంద్రంలో అసిస్టెంట్ వ్యవసాయ అధికారులను సంప్రదించి ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో ఉన్న రైతులందరూ ఈ కేవైసీ ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని మండల వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. శనివారం మండలంలోని గుమ్మడాపురం ఎర్రమఠం ముసలమడుగు గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రైతుల ఈ కేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దగ్గరలోని రైతు భరోసా కేంద్రం నందు ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి వెంకటనారాయణ, సిబ్బంది రైతులు ఉన్నారు.

కొత్తపల్లిలో..

కమనీయం.. వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజామున కల్యాణ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు పట్టువస్త్రాలను గ్రామోత్సవంగా స్థానిక ఏకశిలపదునెట్టాంబడి అయ్యప్ప ఆలయం వరకు వెళ్లి స్వామివారి సమర్పించారు. వేదపండితులు కైపా నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణం కమనీయంగా జరిగింది.

కల్యాణం తిలకించిన ప్రముఖులు: వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి కల్యాణాన్ని తిలకించి వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి : ప్రజా సంఘాలు

ఆత్మకూరు : ప్రచారం చేస్తున్న నాయకులు

బండిఆత్మకూరు : ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బేతంచెర్ల : ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ పట్టుబంధుల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను ఉపాధ్యాయ, ఉద్యోగ, పట్టుబద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు నరసింహ నాయక్, సిఐటియు మండల కార్యదర్శి పాతకోట భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బొల్లు ప్రసాద్ యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం నాడు ఆత్మకూరు మండలంలోని అమలాపురం కృష్ణాపురం వెంకటాపురం, సంజీవనగర్, తాండ బైర్లూటి సిద్దాపురం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన శాసన మండలి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మరింత బలం చేకూర్చే ందుకే పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలైన పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజును పెద్దల సభకు పంపించాలని కోరుతూ ప్రజాసంఘాల సమన్వయ కమిటీ నాయకులు సిపిఎం జిల్లా నాయకులు రత్నమయ్య, సిఐటియు నాయకులు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్, ప్రజాశక్తి విలేకరి జి రంగస్వామి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. శనివారం సంత జూటూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల, గ్రామ సచివాలయం, ఎస్సీ కాలనీ గ్రామంలోని పట్టభద్రులను కలిపి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **పాములపాడు :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లా నాయకులు బి రామేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు చెరుకు చర్ల హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసేపు, రైతు సంఘం నాయకులు మధు కోరారు. శనివారం నాడు పాములపాడు మండల కేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. అన్ని వర్గాల సమస్యల పట్ల మాట్లాడే అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు. **గోస్పాడు :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు మండల కార్యదర్శి ఈ.చెన్నయ్య కోరారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో సిఐటియు నాయకులు చెన్నయ్య, కరిముల్లా, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్కు తదితరులు పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులను, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయాలని అభ్యర్థించారు. **పాణ్యం :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుకు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా పాణ్యం మండలంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య, సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికలలో నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాటం చేసే ఉద్యమ నాయకులను గెలిపించాలని కోరారు. పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్, సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, నాయకులు రాజేష్, శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు మిద్దె వెంకట నాయుడు, వాల్మీకి రాజు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం, సిపిఐ, విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఎల్లయ్య, భార్గవ్, ఈశ్వరయ్య, తిరుమలేష్, వైబి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నాడు బేతంచెర్ల పట్టణంలో పలు కార్యాలయాలు, కళాశాలల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ఉదయ్ కుమార్, ప్రదీప్, శ్రీకర్, రాజు, రామచంద్రుడు, స్వామి నాయుడు, ఎస్సే కలాం, రామాంజనేయులు, మాలిక్, బాషా, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

జొన్న పంటకు మద్దతు ధర

ప్రజాశక్తి - పాములపాడు

జొన్న పంటను ప్రభుత్వం రూ.2979 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని వానాల గ్రామంలో రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి మద్దిలేటి శనివారం తెలిపారు. పంట కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. జొన్న పంట కొనుగోలు కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతుల పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తారని అలాగే గోన సంచులు, హమాలి ఖర్చులు ప్రభుత్వ భరిస్తుందని తెలిపారు. జొన్న పంట రైతులు ముందస్తుగా రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవో మున్నూర్, రైతులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.2970తో జొన్న కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలియజేశారు. మండలంలో జొన్న పంటను సాగు చేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చాగలమర్రి రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైతు భరోసా కేంద్రంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో

మాలోలా నరసింహ స్వామి దీక్ష విరమణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నల్లమల అరణ్యంలో వెలిసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో నరసింహ మాల దీక్షాపరులు శనివారం తమ దీక్షను విరమించారు. మాలోల నరసింహస్వామి సన్నిధిలో అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందంతో కలిసి సుదర్శన హెూమం నిర్వహించారు. మకర సంక్రాంతి భక్తులు అహెూబిలంలో నరసింహ స్వామి మాల దీక్షను స్వీకరించారు. 41 రోజుల పాటు మండల దీక్షను నిర్విరామంగా కొనసాగించి శనివారం దిగువ అహెూబిలం ఆలయ ఆవరణంలో ఇరుముడులు ధరించి కాలినడకన ఎగువ అహెూబిలం అక్కడి నుండి కొండపైన వెలసిన మాలోల నరసింహ స్వామి సన్నిధికి చేరుకున్నారు. మాలోలా సన్నిధిలో ప్రధాన అర్చకులు మాలోల నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ఆవరణంలో సుదర్శన హెూమం నిర్వహించారు. నరసింహ దీక్షాపరులు ఇరుముడి ద్వారా తెచ్చిన వస్తువులను సుదర్శన హెూమంలో వేసి హెూమం నిర్వహించారు. హెూమంలో పూర్ణాహుతి ముగియగానే వెలువడిన కాటుకను నృసింహ మాల దీక్షాపరులకు అందజేశారు.

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు అధ్యక్షతన ఎనర్జీ కన్సర్వేషన్‌లో భాగంగా జాతీయ ఇంధన సంరక్షణ క్లబ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంధన పొదుపుపై శనివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ఇంధన పొదుపు గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు జాన కిరణ్ కుమార్, చవాన్, సతీష్, ఖలీల్ అహ్మద్, పిడి శ్రీనివాసులు, మధు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం

- మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బెనర్జీ మాదిగ

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎస్‌సి వర్గీకరణనే లక్ష్యం అని ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కర్నూల్ జిల్లా నుండి అమరావతి, విజయవాడ వరకు తలపెట్టిన 2వ విడత రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర శనివారము నందికొట్కూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కార్యవర్గం పాదయాత్ర చేస్తున్న ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాయికాటి బెనర్జీ మాదిగను దండోరా డప్పులతో స్వాగతం పలికారు. అనంతరము మిడుతూరు రోడ్డు కూడలి వద్ద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం బెనర్జీ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుపడుతున్నాయని అన్నారు. ఎమ్మార్పీఎస్ శాంత రాజు, నిమ్మకాయల మోహన్, జయన్న, ప్రసాద్, సురేష్, పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించె యాత్రకులకు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శనివారం నాడు చిత్తూరుకు చెందిన బోధానంద స్వామి లక్ష రూపాయలు విరాళంగా సహాయ కార్యనిర్వహణాధికారికి విరాళాన్ని అందజేశా రు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్య లోపం లేకుండా పని చేసిన సిబ్బందికి ఇఒ ఎస్. లవన్న ఆదేశాల మేరకు శనివారం సన్మానం చేశారు. పారిశుధ్యవిభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర ప్రసాద్ పారిశుధ్య విభాగ సిబ్బందికి శ్రీస్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ7,02805 లక్షలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈ శనివారం రూ.7,02,805 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. భక్తుల విరాళాలు, స్వామి అమ్మవార్ల దర్శన టికెట్లు, రూముల బాడుగలు, స్వామివారి ప్రసాదం ఆలయ పరిసర ప్రాంతంలో అంగళ్లు, తదితర సేవల ద్వారా స్వామివారికి ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

టాలెంట్ టెస్ట్ విజయవంతం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - వెలుగోడు

ఎస్ఎఫ్ఐ వెలుగోడు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కిషోర్ శనివారం తెలిపారు. ఈ పరీక్షకు 200 మంది దాకా విద్యార్థులు పైగా హాజరయ్యారని తెలిపారు. మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఎంచుకున్న లక్ష్యాన్ని చేదించాలని అలాగే పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సలహాలు సూచనలు తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణ మాట్లాడుతూ పదో తరగతి తర్వాత విద్యార్థులు మంచి కోర్సులను ఎంపిక చేసుకొని వారిని నైపుణ్యాన్ని పెంపొందించుకొని వారు అనుకున్న లక్ష్యాన్ని చేరాలని అని తెలిపారు. మండల కార్యదర్శి నవీన్ కుమార్, మధు, కిరణ్, అరుణ్, రమేష్, విజయలత, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

మండల వాలంటీర్ల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా లలితమ్మ, సుంకరాజు, కార్యదర్శులు రీయాజ్, జయశంకర్ గౌడు, ట్రెజరీ రవికుమార్, సలహాదారులుగా పవన్ కుమార్ గౌడు, షేకూన్‌బీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరుస్తున్న వాలంటీర్ల భద్రతకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.

వాలంటీర్ల నూతన కార్యవర్గ సభ్యులు

నాటి తహశీల్దార్..

నేడు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండి

అంచలంచలుగా ఎదిగిన చిన్న రాముడు

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

మండలంలో తహశీల్దార్‌గా తన ప్రస్తానాన్ని ప్రారంభించిన ఓ అధికారి నేడు రాష్ట్రస్థాయిలో కీలక పదవిలో ఉన్నాడు. తాను పని చేసిన ప్రాంతానికి వచ్చిన ఆ అధికారి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా విజయవాడలో విధులు నిర్వహిస్తున్న ఐఎఎస్ అధికారి చిన్న రాముడు.. 2004-2005లో జూపాడుబంగ్లా మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిం చారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ప్రస్తుతం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారిగా పని చేస్తున్నారు. తన పర్యటనలో భాగంగా కర్నూలు వెళ్తున్న చిన్న రాముడు తాను పని చేసిన జూపాడుబంగ్లా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు సహాయ గణాంక అధికారి ఏ.హనుమంతు, డీటీ(రీసర్వే) నాగన్న, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ రంగారెడ్డి, వీఆర్‌ఓలు చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాను పని చేసిన సమయంలో చేసిన అభివృద్ధి, కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. జూపాడుబంగ్లా మండలం తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో చుట్టూ చెట్లు పెట్టి ఒక వనమాళికగా మార్చి మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేసిన ప్రస్తుత తహశీల్దార్ బి పుల్లయ్యను చిన్నరాముడు అభినందించారు.

మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి చిన్న రాముడు